## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జ్ఞానేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి రిటైర్డ్ డీఐజీ కిమిడి రాజరత్నంనాయుడు, పద్మావతి కుమారులు కిరణ్ కుమార్, వరుణ్ కుమార్ రూ.1,00,116 ఆర్థిక సహాయం చేశారు. నగదును ట్రస్టు సభ్యులు ఎస్.వి. జి.శ్రీనివాసరావు, దాసరి రవి, అప్పికొండ ఆదిబాబుకు సోమవారం అందజేశారు.

### దేవుపల్లిలో గడ్డివాము దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బొండపల్లి: మండలంలోని దేవుపల్లిలో సోమవారం ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో అల్లూరి శ్రీనివాసరాజుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. వెంటనే విషయాన్ని గజపతినగరం అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడంతో ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 40 వేల రూపాయల నష్టం జరిగి ఉంటుందని అంచనా.

### తెగుళ్లపై అప్రమత్తం

దత్తిరాజేరు: అపరాల పంటలైన పెసర, మినుము పంటలకు ఆశించే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చ పురుగు, బూడిద పురుగు సోకినట్లైతే లీటర్ నీటిలో మిల్లీ గ్రామ్ ప్రాపికొనజోల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మచ్చల పురుగులు మొగ్గ దశలో సోకి పిందెలను తినేస్తాయన్నారు. వీటి నివారణకు లీటర్ నీటిలో 0.4 గ్రాముల ఎమోమెక్టిన్, బెంజోయేట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

### వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయం

బొబ్బిలి: వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయమని, అలాగే తాను కూడా ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు జోష్యం చెప్పారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు సోమవారంతో నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేక్ కట్ చేసి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇంటి గోపాలరావుకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీని ఓడించలేరన్నారు. రానున్న ఎన్నికల్లో గెలవాలన్న ఆశతో టీడీపీ ఎన్నో కుట్రలు చేస్తోందని, ఇరుకు రోడ్లలో చంద్రబాబు సభలు పెట్టి ప్రజలను మభ్యపెట్టడంతో పాటు అమాయకులైన ఎంతోమంది ప్రాణాలు తీస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు ఎప్పుడో వందకు వంద మార్కులు వేశారని తెలిపారు. పవన్, చంద్రబాబు భేటీ ద్వారా వారిద్దరి మ్యాచ్ ఫిక్సింగ్ మరోసారి తేటతెల్లమైందన్నారు. ప్రజా సంక్షేమం కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎంను చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ కృష్ణారావు, బుడా చైర్మన్ ఐ. పార్వతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ టి.పార్వతి, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ మురళి పాల్గొన్నారు.

రేగిడి: ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు సోమవారంతో నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని వావిలవలస గ్రామంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పార్టీ శ్రేణులతో కలిసి కేకు కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. అనంతరం యాత్ర ముఖ్య విశేషాలు, సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సీఎం జగనన్న చేపట్టిన ఈ యాత్రకు విశేష స్పందన లభించిందని, యాత్రలో ప్రజలు ఆయనకు విన్నవించిన ప్రతీ సమస్యను గుర్తు పెట్టుకుని మరీ ఆయన పరిష్కరిస్తుండడం, ఆ దిశగా పరిపాలనలో సంస్కరణలు తీసుకువస్తుండడం చాలా గొప్ప విషయమని ప్రశంసించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్ మోహన్‌రావు, జిల్లా వ్యవసాయసలహా మండలి చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు ఎం.ప్రసన్నలక్ష్మి, కె.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బాధితవర్గాలకు అండగా ఉంటాం..



దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం:

బాధితవర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం అందించేలా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నగరానికి చెందిన ముగ్గురికి రూ.6.45 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ చెక్కులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో మంజూరు చేసిన రూ.2.76 లక్షల విలువ గల మూడు త్రిచక్ర స్కూటీలను విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లలో పేదల సంక్షేమం కోసం చేపట్టిన పథకాల గురించి వివరించారు. జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు 70 స్కూటీలను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇందులో విజయనగరం నియోజకవర్గానికి మూడు స్కూటీలు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే అనారోగ్యాల కారణంగా ఇబ్బంది పడిన స్థానికులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందజేసి మెరుగైన చికిత్స అందజేశామని ఆయన గుర్తు చేశారు.

**ఆరుగురికి రూ.9.21 లక్షల ఆర్థిక చేయూత..**

రూ.2.76 లక్షల వెచ్చించి కొనుగోలు చేసిన మూడు త్రిచక్ర స్కూటీలను నగరానికి చెందిన ముచ్చ లక్ష్మి, దాసరిరెడ్డి ఉమామహేశ్వరి, రౌతు ధనలక్ష్మిలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అందజేశారు. అలాగే అశోక్‌నగర్‌కు చెందిన సారిక అఖిలకు రూ.2 లక్షలు, చిక్కాల వీధికి చెందిన కిల్లంపూడి సాయి ఈశ్వర్ మోహన్ కుశాల్‌కు రూ.45 వేలు, కేఎల్ పురానికి చెందిన నడింపల్లి వెంకట రామకృష్ణరాజుకు రూ.4లక్షల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, విభిన్న ప్రతిభావంతుల విభాగం సహాయ సంచాలకుడు జగదీష్, స్థానిక ప్రతినిధులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం దృష్టికి 108 ఉద్యోగుల సమస్యలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు వినతిపత్రం అందజేస్తున్న 108 ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

విజయనగరం: అత్యవసర వైద్య సేవలు అందిస్తున్న 108 ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. 108 సర్వీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని ఆయన నివాసంలో సోమవారం కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం 108 ఉద్యోగ సంఘ నేతలు మాట్లాడుతూ, తమకు ఉద్యోగ భద్రత, జీతాల పెంపు, ప్రభుత్వ వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలని కోరారు. డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన వారిలో 108 యూనియన్ నాయకులు జీకే మోహన్, ఎ.రాజు, వి. కృష్ణ, వై. పైడిరాజు ఉన్నారు.

## సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయ పరిధిలోని జగనన్న ఇళ్ల లబ్ధిదారులందరినీ సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో సుమారు 2000 మందికి ఇంటి స్థలంతో పాటు ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. వీటిలో చాలా ఇళ్ల పనులు పూర్తయ్యాయని, మిగిలినవి కూడా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, ఎంపీడీఓ గంటా వెంకటరావు, తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, హౌసింగ్ ఏఈ వర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం



వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవీంద్రను సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: వాకర్స్ క్లబ్ సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజానికి నడక ప్రాధాన్యాన్ని వివరించాలన్నారు. సామాజిక ప్రయోజన కార్యక్రమాలను విరివిగా చేపట్టడం ద్వారా స్వచ్ఛంద సంస్థలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు. అనంతరం నూతన గవర్నర్‌గా ఎంపికైన కర్రోతు సత్యంచే పూర్వపు గవర్నర్ పీఈ గుప్తా ప్రమాణ స్వీకారం చేయించారు.

కార్యక్రమంలో కార్యవర్గ ప్రతినిధులు త్యాడ చిరంజీవి, కేపీ రమణమూర్తి, ముల్లపూడి సుభద్రాదేవి, మోనంగి జనార్ధనరావు, సత్యానందం ద్వారకానాథ్, గున్నేశ్వరరావు, బసవమూర్తి, శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సహకరిస్తాం



టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

- టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నుంచి రూ.10 లక్షల సహాయం అందిస్తామని టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఆ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ చాగంటి గౌతం శాస్త్రి, కమిటీ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డిని విశాఖపట్నంలో ఆయన క్యాంపు ఆఫీస్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. లచ్చింపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి సహాయం కోరుతూ గతంలో దరఖాస్తు చేసుకున్న విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, త్వరలో రూ.10 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుమ్మడి రవి శంకర్, ఎన్.మధుకుమార్, అల్లు వెంకటరమణ, డి.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని 16 గ్రామాల్లో దేవాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవ స్థానం ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున రూ.1.60 కోట్లు నిధులు మంజూరు చేసిందని ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చుక్కవలసలో అయ్యప్ప ఆలయం, శివరాం, తోండ్రంగి,రేగటి అగ్రహారంలో శివాలయాలు, నడిపేనపేట, దేవాడ, వాల్లెపేట, విజయరాంపురం, బాగువలస, ఏనుగువలస, మందిరవలస లో రామాలయాలు, గరివిడి, వెదుళ్లవలసలో శ్రీకృష్ణాలయాలు, కె.పాలవలసలో పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేసిన రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు ఆయా గ్రామాల ప్రజల తరఫున విశ్వేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

### జీఓ 1 రద్దు చేయాల్సిందే..



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విజయనగరం పూల్‌బాగ్: జీఓ 1ని వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో అన్ని పార్టీలతో కలిసి ఉద్యమిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక అమర్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలనే సాగుతోందన్నారు. ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని జీఓ 1 పేరిట తన సొంత నియోజకవర్గంలో తిరగనీయకపోవడ శోచనీయమన్నారు. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల గొంతు నొక్కేందుకు జీఓ ఒకటి తీసుకువచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు, జిల్లా ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, పార్వతీపురం జిల్లా కార్యదర్శి కె. మన్మధరావు, సహాయ కార్యదర్శి టి. జీవన్ పాల్గొన్నారు.

## ఖాళీ స్థలాలకు పన్ను విధింపుపై ప్రత్యేక డ్రైవ్



ప్రత్యేక కౌంటర్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఖాళీ స్థలం యజమాని

విజయనగరం: నగరంలోని ఖాళీ స్థలాలకు పన్ను విధింపుపై కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈనెల 13వ తేదీ వరకు ప్రత్యేక కౌంటర్లలో ఖాళీ స్థలాల పన్ను స్వీకరిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు సోమవారం మాట్లాడుతూ, నగరవాసులు తాము చేపట్టిన ప్రత్యేక కార్యచరణ విధానాన్ని చక్కటి అవకాశంగా భావించాలన్నారు. కార్పొరేషన్ కార్యాలయ మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన నాలుగు కౌంటర్లలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు జిరాక్స్ కాపీలు, ఈసీ, ప్రస్తుత మార్కెట్ విలువ ధ్రువీకరణ, 250 రూపాయల చలానా సమర్పించినట్లైతే 72 గంటలలో ప్రొసిడింగ్ పత్రాలు అందిస్తామని వెల్లడించారు. ఇదిలా ఉండగా ప్రత్యేక డ్రైవ్ మొదటి రోజుకు స్పందన కరువైంది. నగరంలో అన్ని ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఖాళీ స్థలాలుండగా.. సంబంధిత యజమానులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించటం గమనార్హం.

# గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నెల్లిమర్ల: పట్టణంలోని 6,7, 8, 9, 10 వార్డులకు చెందిన 450 మంది లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ కనెక్షన్లు సోమవారం పంపిణీ చేవారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్‌చైర్మన్లు కారుకొండ వెంకటకృష్ణారావు, సముద్రపు రామారావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణానికి చెందిన ఎంతోమంది ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఇళ్ల స్థలాలు అందజేశారన్నారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే ఎమ్మెల్యే సహకారంతో స్థలాలు అందజేస్తామని చెప్పారు. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారుల తప్పిదం వల్ల కొండ ప్రాంతంలో లేఅవుట్ వేశారని, అయితే ఆ ప్రాంతం నివాసానికి అనువుగా ఉండదనే ఉద్దేశంతో లబ్ధిదారులు నిర్మాణానికి ముందుకు రాలేదని చెప్పారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ దృష్టికి తీసుకెళ్లామని, పూడమ్మతల్లి వనంగుడి సమీపంలో సర్వే నంబర్316లో డి పట్టా భూమి గాని, చంద్రబాబు కాలనీకి ఆనుకుని ఉన్న అటవీశాఖ భూమి గాని సేకరించి కొత్తగా లే అవుట్ వేస్తారని తెలిపారు. అలాగే టిడ్కో ఇళ్లకు సంబంధించి డిపాజిట్లు చెల్లించిన వారికి త్వరలోనే ఇళ్లు కేటాయించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్లు మంజూరు కాని వారికి డిపాజిట్లు తిరిగి చెల్లిస్తారని చెప్పారు. 7, 8, 9 వార్డుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఆయా ప్రాంతాల్లో తాత్కాలికంగా బోర్లు తవ్వించి, ట్యాంకులను ఏర్పాటు చేశామన్నారు. శాశ్వత పరిష్కారానికి పట్టణంలో రూ. 36 కోట్లతో తాగునీటి పథకాలు, పైప్‌లైన్లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు మొదలయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో పైడిమాంబ గ్యాస్ ఏజెన్సీస్ అధినేత చంద్రశేఖర్, కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, బూర సుజాత, మొయిద శ్రీనివాసరావు, రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నౌపడ శ్రీనివాసరావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు రవ్వా నాగేంద్రవర్మ, పైల మురళి, మజ్జి గణేష్, బూర సత్యనారాయణ, కారుకొండ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



ప్రజాసంకల్పయాత్ర నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు

- వైస్ ఎంపీపీ సత్యనారాయణరాజు

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మండల వైస్ ఎంపీపీ ఎన్. సత్యనారాయణరాజు అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ముగిసి సోమవారానికి నాలుగు సంవత్సరాలు పూర్తి కావడంతో సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలలో 98 శాతం అమలు చేసి ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సంక్షేమ పథకాలు వెల్లువలా ప్రతి ఇంటి తలుపు తడుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనలో చావు కేకలు తప్ప సంక్షేమం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, దాడిశెట్టి త్రినాథరావు, మహంతి లక్ష్మణరావు, టొంపల సీతారాం, గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, కొత్తకోట శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికే గృహ సారథుల నియామకం

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



గజపతినగరం: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం/బొండపల్లి/గంట్యాడ: వైఎస్సార్ సీపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికే గృహసారథులను నియమిస్తున్నట్లు గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గజపతినగరంలోని పార్టీ కార్యాలయంలో గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు మండలాల పార్టీ సచివాలయ స్థాయి కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులతో, గంట్యాడ మండల నాయకులతో గంట్యాడ లో వేర్వేరుగా సోమవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ 50 కుటుంబాలకు ఇద్దరు చొప్పున గృహసారథుల నియామకం సంక్రాంతి పండగలోగా పూర్తి చేయాలన్నారు. ఒకటి, రెండు రోజుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా సమావేశమై ప్రజలతో సత్సంబంధాలు కలిగిన యువకులను గృహ సారథులుగా ఎంపిక చేయాలని సూచించారు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను కో-ఆర్డినేట్ చేయడానికి మండలానికి ఒక కన్వీనర్‌ను కూడా నియమి స్తామని చెప్పా రు. అదేవిధంగా మండల కమిటీలు, జిల్లా కమిటీల నియాయకం కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉందని అది కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పని చేసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ పార్టీ విజయం సాధించేలా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పను లను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, అర్హత ఉండి ఎవరికైనా పథకాలు అందకపోతే వారి వివరాలు సేకరించి పథకాలు అందేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు బి.వి.ప్రభూజీరాజు, సీనియర్ నాయకుడు నారాయణమూర్తి రాజు, గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాల జెడ్పీటీసీలు గార తవుడు, రౌతురాజేశ్వరి, రాపాక సూర్యప్రకాశరావు, దత్తిరాజేరు, బొండపల్లి ఎంపీపీలు గేదెల సింహాద్రి అప్పలనాయుడు, చల్ల చలం నాయుడు, గజపతినగరం,దత్తిరాజేరు మండలాల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, కడుబండి రమేష్ నాయుడు, గజపతినగరం ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలు నాయుడు, గజపతినగరం పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, బొండపల్లి మాజీ ఎంపీపీ బండారు బంగారం, పార్టీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, పల్లిసంజీవరావు, రెడ్డి పద్మావతి, సామంతుల పైడిరాజు, మంత్రి అప్పలనాయుడు బొద్దల చిన్నంనాయుడు పాల్గొన్నారు.

- గంట్యాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, నాయకులు ఎం.ఎల్.ఎన్.రాజు, కొండపల్లి కొండలరావు, లచ్చిరెడ్డి కృష్ణ, కిలపర్తి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాసంకల్పయాత్రకు నాలుగేళ్లు**

ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా గజపతినగరం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**జనసేన, టీడీపీ ముసుగులు తీసేశాయి**

ఇన్నాళ్లూ ముసుగు వేసుకుని ఒకే ఎజెండాతో రాజకీయం చేసిన జనసేన, తెలుగుదేశం పార్టీల అధ్యక్షులు పవన్ కళ్యాణ్, చంద్రబాబునాయుడు పరామర్శపేరుతో ఆదివారం ఆ ముసుగు తీసేశారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య విమర్శించారు. టీడీపీ, జనసేనతో పాటు ఎంత మంది కలిసి వచ్చినా సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. వీరి కుట్ర, కపట రాజకీయాలను రాష్ట్ర ప్రజలు గమ నిస్తున్నారని, వీరి మధ్య బంధాన్ని ప్రజలు చీదరించుకుంటున్నారని ఎమ్మెల్యే అన్నారు. చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని పెట్టినట్లు ఉందని ఎద్దేవా చేశారు. వారి కుట్ర రాజకీయాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు.